క్లుప్తంగా

మోసపూరిత హామీలపై ఓటర్లను చైతన్య పరచాలి



చుండూరు(భట్టిప్రోలు): చంద్రబాబు ఇస్తున్న మోసపూరిత హామీలపై ఓటర్లను చైతన్య పరచాలని చుండూరు మండల ఎన్నికల పరిశీలకులు దాది సుబ్బారావు అన్నారు. శుక్రవారం గృహ సారధులు, బూత్ కమిటీల నిర్వాహకులు, పార్టీ నాయకులతో ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. సుబ్బారావు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ప్రతి ఓటు ఎంతో కీలకమని తెలిపారు. పోలింగ్ రోజున చేపట్టాల్సిన కార్యక్రమాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను గూర్చి వివరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు దాట్ల సౌజన్య, మాజీ జెడ్పీటీసీ సభ్యులు గాదె శివ రామకృష్ణారెడ్డి(బాబు), సర్పంచ్ పి.ఏసు, ఎంపీటీసీ ప్రవీణ్, అన్నపరెడ్డి వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

రేపల్లె రూరల్: మండలంలోని గంగడిపాలెం విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతుల నేపథ్యంలో శనివారం విద్యుత్ సరఫరాకు ఆటంకం కలగనుందని ఏడీఈ టి.శ్రీనివాసరావు తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలలో విద్యుత్ సరఫరా నిలుపు చేస్తున్నట్లు చెప్పారు. విద్యుత్ వినియోగదారులు గమనించాలని కోరారు.

పాలిసెట్ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

రేపల్లె రూరల్: ఈ నెల 27న నిర్వహించే పాలిసెట్ పరీక్షకు పట్టణంలో మూడు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పాలిసెట్ పరీక్షల కోఆర్డినేటర్, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.చంద్రశేఖర్ తెలిపారు. స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం ఆయన మాట్లాడారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, భాష్యం హైస్కూలు, రామకృష్ణ ఇంగ్లీష్ మీడియం స్కూళ్లలో పాలిసెట్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష జరుగుతుందన్నారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు 9 గంటలకే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. వేసవి ఎండలను దృష్టిలో ఉంచుకుని ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచటంతో పాటు మెడికల్ క్యాంప్‌లు నిర్వహిస్తున్నామన్నారు. పరీక్షకు దరఖాస్తు చేసుకుని ఫీజు చెల్లించనివారు గానీ, హాల్ టిక్కెట్ రానివారు గానీ 27న ఉదయం 8 గంటలకు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు చేరుకోవాలని చెప్పారు. పూర్తి వివరాలకై 8096555306 నంబరును సంప్రదించాలన్నారు.

వేమూరులో రెండు నామినేషన్లు తిరస్కరణ

వేమూరు : సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసేందుకు అభ్యర్థులు దాఖలు చేసిన నామినేషన్లలో రెండు నామినేషన్లు తిరస్కరించినట్లు ఆర్‌ఓ వసంతరాయుడు తెలిపారు. శుక్రవారం నిర్వహించిన నామినేషన్ల పరిశీలనలో భాగంగా రెండు నామినేషన్లు నిబంధనలకు విరుద్ధంగా ఉండటంతో తిరస్కరించినట్లు చెప్పారు. మొత్తం 24 నామినేషన్లు దాఖలవ్వగా, 22 నామినేషన్లు చెల్లుబాటైనట్లు పేర్కొన్నారు. శుక్రవారం మరో అభ్యర్థి నామినేషన్ ఉపసంహరించుకోగా 15 మంది అభ్యర్థుల నామినేషన్లు అంగీకరించినట్లు తెలిపారు. నామినేషన్ల ఉపసంహరణ గడువు లోపు ఉపసంహరించుకునే నామినేషన్ల అనంతరం పోటీలో ఉన్న అభ్యర్థుల వివరాలు తెలియనున్నట్లు పేర్కొన్నారు.

చంద్రబాబు బ్రాహ్మణ ద్వేషి

లక్ష్మీపురం: చంద్రబాబు బ్రాహ్మణ ద్వేషం మరోసారి బయటపడిందని బ్రాహ్మణ సంఘం నాయకుడు, 32వ డివిజన్ కార్పొరేటర్ ఈచంపాటి వెంకటకృష్ణ (ఆచారి) పేర్కొన్నారు. ఆత్మీయ సమావేశం పేరిట ప్రచురించిన పోస్టర్‌లో ఒక్క బ్రాహ్మణ నాయకుడి ఫొటో కూడా లేకపోవడమే అందుకు నిదర్శనమని శుక్రవారం బ్రాడీపేటలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చెప్పారు. తెలుగుదేశం పార్టీ మొదటి నుంచి కూడా బ్రాహ్మణ వ్యతిరేక ధోరణితోనే ముందుకు సాగిందని మండిపడ్డారు. బ్రాహ్మణులకు టీడీపీలో అసలు ప్రాతినిధ్యమే లేదనీ.. ఒక్క ఎమ్మెల్యే సీటు కూడా ఇచ్చిన పాపాన పోలేదని పేర్కొన్నారు.

రైల్వే ప్లాట్‌ఫాంపై గుర్తు తెలియని వ్యక్తి మృతి



తెనాలిరూరల్: తెనాలి రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫాంపై గుర్తు తెలియని వ్యక్తి శుక్రవారం మృతి చెందాడు. మృతుడి వయసు సుమారు 60 ఏళ్లు ఉంటుంది. స్టేషన్‌లోని ఐదో నంబరు ప్లాట్‌ఫాం మీద మృతి చెంది పడి ఉన్నాడు. సమాచారం అందుకున్న జీఆర్పీ పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి తెనాలి జిల్లా వైద్యశాల మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అభివృద్ధిపై విషం చిమ్మే యత్నం

- పచ్చ పత్రికల విషపు రాతలు
- టీడీపీ నేతల కనుసన్నల్లో ఆగడాలు
- గ్రామాల్లో ప్రజల మధ్య చిచ్చుపెట్టే కుట్రలు

రేపల్లె రూరల్: టీడీపీ నాయకులు గ్రామాల్లో ప్రజల మధ్య చిచ్చుపెట్టి రాజకీయ లబ్ధి పొందేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తూ అభాసుపాలవుతున్నారు. పచ్చ పత్రికల్లో విషపు రాతలు రాయించి ప్రజల మనస్సుల్లో విష బీజాలు నాటుతున్నారు. రేపల్లె మండలం ఉప్పూడి పంచాయతీ పరిధిలోని ఊలుపాలెంలో 500 ఇళ్లకు ఓవర్ హెడ్ ట్యాంకు నుంచి 24 గంటలు నీటి సరఫరా జరుగుతోంది. ఇటీవల పలుచోట్ల పైపులకు లీకులు ఏర్పడి నీరు వృథా అవుతుంది. దీంతో పంచాయతీ అధికారులకు సమాచారం ఇచ్చి గ్రామస్తులు స్వచ్ఛందంగా లీకులకు మరమ్మతులు నిర్వహించేందుకు గురువారం నాలుగు గంటల సమయంలో నీటి సరఫరా నిలుపుదల చేసుకుని, పనులు పూర్తి చేసుకున్నారు. ఇదే అదునుగా భావించిన గ్రామంలోని టీడీపీ నాయకులు ఉద్దేశపూర్వకంగా నీటి సరఫరా నిలుపుదల చేశారని అభాండాలు వేస్తూ శుక్రవారం తోక పత్రికల్లో విషం చిమ్మే రాతలు రాయించారు. ఎన్నో ఏళ్లుగా ఉలుపాలెంలో వేధిస్తున్న నీటి సమస్యను అధిగమించేందుకు రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు ప్రత్యేక చొరవతో రూ.1.4కోట్ల



ఊలుపాలెంలో ఓవర్ హెడ్ ట్యాంక్

వ్యయంతో ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణంతో పాటు ఇంటింటికీ టాప్ కనెక్షన్లు ఏర్పాటు చేయించారు. దీంతో నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. ఇది ఓర్వలేని కొంత మంది టీడీపీ సానుభూతిపరులు గ్రామంలో చిచ్చుపెట్టి రాజకీయ లబ్ధి పొందేందుకు కుట్ర



వృథా అవుతున్న నీరు

లకు తెరలేపారు. పైపులైన్ల మరమ్మతుల కోసం రెండు గంటలపాటు నీటి సరఫరా నిలుపుదల చేస్తే ఉద్దేశపూర్వకంగా ఆపారంటూ ఎల్లో పత్రికల్లో రాయించి, కులాల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నం చేశారు.

గ్రామంలో నీటి సమస్య లేదు

ఊలుపాలెంలోని పంప్ హౌస్ వద్ద మోటారు కండెన్సర్ మరమ్మతులకు గురైంది. గురువారం సాయంత్రం 6 గంటలకల్లా కొత్తదాన్ని అమర్చి యథావిధిగా నీరు సరఫరా చేశాం. ఈ సమయంలో గ్రామస్తులు కొందరు తమకు సమాచారం ఇచ్చి పైపులైన్‌లకు మరమ్మతులు చేసుకున్నారు.

గౌస్ బాషా, పంచాయతీ కార్యదర్శి

పాఠశాలలో దర్జాగా విందు వంటకాలు

- తన కుమారుడి వివాహానికి పాఠశాలనే వంటశాలగా మార్చేసిన టీడీపీ నాయకుడు
- స్థానికుల ఫిర్యాదుతో అడ్డుకున్న విద్యాశాఖ అధికారులు

రేపల్లె రూరల్: మండలంలోని ఉప్పూడి పంచాయతీ ఊలుపాలెం గ్రామానికి చెందిన ఓ టీడీపీ నాయకుడు తన కుమారుడి వివాహ వేడుకకు ప్రభుత్వ పాఠశాలను వేదికగా మార్చేసుకున్నాడు. విద్యాశాఖ, పంచాయతీ అధికారులకు ఎటువంటి సమాచారం అందించకుండా స్కూలు ఆవరణలో వంట పనులను ఏర్పాటు చేసి స్కూలు బిల్డింగ్‌లకు మైకులను సైతం అమర్చాడు. హెచ్చు స్థాయిలో మైకుల నుంచి వస్తున్న శబ్దాలకు స్థానికులు బెంబేలెత్తారు. ఇదేమిటని ప్రశ్నించిన వారికి సమాధానం ఇవ్వకపోవటంతో గ్రామస్తులు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై మండల విద్యాశాఖ అధికారి రత్నశేఖర్ మాట్లాడుతూ ఊలుపాలెం స్కూలు భవనం ఆవరణంలో వంటలు ఏర్పాటు చేయటంతో



ఊలుపాలెం ప్రాథమిక పాఠశాల ఆవరణలో వంటలు చేస్తున్న దృశ్యం

పాటు మైకుల ద్వారా విపరీత శబ్దాలు చేస్తున్నట్లు గ్రామస్తుల ద్వారా తమకు ఫిర్యాదు అందిందని చెప్పారు. దీంతో తాను సంఘటన స్థలానికి చేరుకుని పాఠశాల ఆవరణలో వంట చేసే కార్యక్రమాన్ని నిలిపివేసి మైకులను తీయించి వేసినట్లు చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలో అనుమతులు లేకుండా ప్రైవేటు కార్యక్రమాలు నిర్వహించరాదని హెచ్చరికలు జారీ చేసినట్లు చెప్పారు.

అభివృద్ధి, సంక్షేమం చూసి ఓటేయండి

బాపట్ల: రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమం చూసి ఓటు వేయాలని సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు గుంద్రెడ్డి శివ కోరారు. పట్టణంలోని కానుమానువారిపాలెంలో వైఎస్సార్ సీపీ తరఫున ప్రచార కార్యక్రమం శుక్రవారం చేపట్టారు. అర్హతే ఆధారంగా ప్రతి ఒక్క ఇంటికి సంక్షేమ ఫలాలు అందించిన గొప్ప నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరేనని అన్నారు. పేద ప్రజల కోసం అను నిత్యం కృషి చేస్తున్న జగనన్నకు అండగా ఉండాల్సిన సమయం వచ్చిందని ఆయన పేర్కొన్నారు. సినీ నిర్మాత కోన వెంకట్ మాట్లాడుతూ బాపట్లకు మెడికల్ కళాశాల, జిల్లా కేటాయించిన ముఖ్యమంత్రికి, వాటిని సాకారం చేసిన కోన రఘుపతికి ఓట్లు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ



కాకుమానువారిపాలెంలో ప్రచారం చేపడుతున్న నాయకులు

పట్టణ అధ్యక్షుడు కాగిత సుధీర్‌బాబు, నాయకులు కానుమాను గోపి, షేక్.సయ్యద్‌మీర్, నర్రావుల వెంకట్రావు, జోగి రాజా, చింతల రాజశేఖర్, కొ(్రా ఏడుకొండలు, అడే చందు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదాతలు కండి



రక్తదాన శిబిరాన్ని పర్యవేక్షిస్తున్న ముప్పలనేని శ్రీనివాసరావు

బాపట్ల: రక్తదానంతో ప్రాణదాతలుగా మారవచ్చని బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షులు ముప్పలనేని శ్రీనివాసరావు పేర్కొన్నారు.బాపట్ల మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో రేపల్లె రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ముప్పలనేని మాట్లాడుతూ రక్తదానం చేయడం వలన ప్రాణదాతలుగా నిలుస్తారని పేర్కొన్నారు. 'బ్లడ్ డోనర్స్ ఆర్ లైఫ్ సేవర్స్' అనే నానుడిని నిజం చేసినవారు అవుతారన్నారు. 60 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ మానం నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు దొప్పలపూడి రామ్మోహన రావు, గెల్లి దిలీప్‌కుమార్, కరస్పాండెంట్ కొమ్మినేని హరిపద్మ ప్రసాద్, ట్రెజరర్ తాళ్లూరి రామకృష్ణ ,ప్రిన్సిపల్ డాక్టరు జి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే

యాజలి(కర్లపాలెం): ప్రీ ప్రైమరీ విద్య పూర్తయిన చిన్నారులను స్థానిక ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఏసీడీపీవో లక్ష్మీపార్వతి సూచించారు. యాజలి ఎస్సీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ప్రీ ప్రైమరీ పూర్తి చేసుకున్న చిన్నారులు ప్రాథమిక పాఠశాలల్లో చేరేందుకు సర్టిఫికెట్లు అందజేశారు. మూడేళ్లు నిండి ఆరేళ్ల లోపు చిన్నారులను తప్పనిసరిగా అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని తల్లులకు సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారుల ఎదుగుదలకు కావలసిన పౌష్టికాహారం ఇవ్వటంతో పాటు ఆటపాటలతో విద్య నేర్పించటం జరుగుతుందన్నారు. సూపర్‌వైజర్ కెజెఎస్ సౌజన్య మాట్లాడుతూ కాన్వెంట్లకు దీటుగా అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారులకు విద్యాబోధన జరు



యాజలి అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే

గుతుందని చెప్పారు. శారీరక ఎదుగుదలకు అవసరమయ్యే పౌష్టికాహారం అందించటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు మరియమ్మ, శివపార్వతి, రాజకుమారి, రమాదేవి, వీరకుమారి, నాగలక్ష్మి, మహిళలు చిన్నారులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల కలలను సాకారం చేయండి

విద్యార్థులకు ప్రముఖ అధ్యాపకులు వీరాంజనేయరెడ్డి ఉద్బోధ

బాపట్ల: విద్యార్థులు చక్కగా చదువుకుని ఉన్నత స్థితికి చేరుకోవాలని మాస్టర్ మైండ్స్ సీనియర్ అధ్యాపకులు వీరాంజనేయరెడ్డి పేర్కొన్నారు. పదో తరగతిలో 550 మార్కులకు పైబడి వచ్చిన విద్యార్థులకు బాపట్లలోని అశోకా కన్వెన్షన్ హాలులో ప్రతిభ పురస్కారాలతో పాటు నగదు బహుమతిని అందించారు. ఈ సందర్భంగా విద్యార్థులు భవిష్యత్‌లో ఏవిధంగా ముందుకు పోవాలి.. ఏ కోర్సులను ఎంచుకోవాలనేది సీనియర్ అధ్యాపకులు వీరాంజనేయరెడ్డి వివరించారు. విద్యార్థులు తల్లిదండ్రుల కలలను సాకారం చేసేవిధంగా కృషి చేయాలని సూచించారు. ముందుగా విద్యాసంస్థల అడ్మిన్, అడ్వైజర్ మట్లుపల్లి మోహన్ విద్యార్థులకు ఆన్‌లైన్‌లో విద్యా వ్యవస్థపై పలు సూచనలు ఇచ్చారు.



వీరాంజనేయరెడ్డి చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకుంటున్న విద్యార్థిని పావని సాయి

మెరక అక్రమ రవాణాదారుపై చర్యలకు వినతి

భట్టిప్రోలు: స్మశాన వాటిక కోసం తోలిన మెరకను ఓ వ్యక్తి అన్యాక్రాంతం చేయడమే కాక దౌర్జన్యానికి దిగిన సంఘటన భట్టిప్రోలులో చోటు చేసుకుంది. భట్టిప్రోలు మండలం ఐలవరం గ్రామంలోని సర్వే నెంబర్ 706/2లో హిందూ స్మశాన వాటికకు 0.40 సెంట్ల స్థలం ప్రభుత్వం కేటాయించింది. ఆ స్థలంలో గత ఏడాది గ్రామస్తుల సహకారంతో కొంతమేర ఇసుక, మట్టితో మెరక వేయడం జరిగింది. అనంతరం వర్షాలు పడటంతో స్మశానవాటికలో అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. గురువారం రాత్రి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ప్రోక్లైయినర్ ద్వారా మెరకను మరొక ప్రదేశానికి తరలించాడు. విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ మాచర్ల కోటేశ్వరరావు సంఘటనా స్థలానికి వెళ్లగా ఆ వ్యక్తి దౌర్జన్యానికి దిగడమే కాక దుర్భాషలాడాడు. ఈ సంఘటనపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు శుక్రవారం తహసీల్దార్ ఐ.మునిలక్ష్మి, ఎస్ఐ కాసుల శ్రీనివాసరావులకు వినతి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మాచర్ల కోటేశ్వరరావు, గట్టు శ్రీనివాసరావు, బట్టు బసవనాగేశ్వరరావు, మాచర్ల హేమసుందరరావు, ఆకురాతి నారాయణరావు, మాచర్ల నారాయణరావు, జొన్నాదుల శరత్‌బాబు, కర్రా కిషోర్, వెనిగళ్ల వెంకట నాంచారయ్య, అందె సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

REMEMBERING



Vemuri Vinaya Kumari
Rtd. Head Mistress
On her 3rd Anniversary
Memorial Day
FAMILY MEMBERS
&
St.Joseph's Educational Society, Tenali

కేంద్ర బృందం సొసైటీల సందర్శన

భట్టిప్రోలు: బాపట్ల జిల్లాలో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలలో నిర్వహిస్తున్న కంప్యూటరీకరణపై ఏపీ సహకార బ్యాంకు శిక్షణ కేంద్రం ఫ్యాకల్టీ బృందం శుక్రవారం భట్టిప్రోలు విచ్చేసింది. ఈ సందర్భంగా స్థానిక పీఏసీఎస్‌లో కంప్యూటరీకరణలో ఎదురవుతున్న సమస్యలు తదితర అంశాలపై సొసైటీ ఉద్యోగులు నివృత్తి చేశారు. భట్టిప్రోలు జీడీసీసీ బ్యాంక్ పరిధిలోని సూరేపల్లి, భట్టిప్రోలు సొసైటీలను సందర్శించారు. జిల్లా డెప్యూటీ మేనేజర్ కె.విజయచంద్రారెడ్డి మాట్లాడుతూ కంప్యూటరైజేషన్‌లో ఏ విధమైన అలసత్వానికి తావివ్వకుండా సత్వరమే సంఘానికి సంబంధించిన వివరాలు అన్నీ తెలియచేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ ఎస్ అరుణ, సూపర్‌వైజర్ డీవీటీఎస్‌వీ ప్రసాద్, సొసైటీ సీఈవోలు వేములపల్లి శ్రీనివాస్, బొర్రా శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.



భట్టిప్రోలులో సంఘం వద్ద బృంద సభ్యులు

రేపల్లెలో మూడు నామినేషన్‌లు తిరస్కరణ

రేపల్లెరూరల్: సార్వత్రిక ఎన్నికలలో భాగంగా రేపల్లె అసెంబ్లీ నియోజకవర్గానికి అభ్యర్థుల నుంచి అందిన నామినేషన్‌లపై శుక్రవారం ఎన్నికల అధికారి కార్యాలయంలో పరిశీలన చేపట్టారు. పరిశీలనలో ముగ్గురు అభ్యర్థుల నామినేషన్‌లు తిరస్కరణకు గురైందని ఎన్నికల రిటర్నింగ్ అధికారి హెలా షారోన్ వెల్లడించారు. ఈవూరు సృజన్, అనగాని మంజుల, మోపిదేవి మౌనిష్‌ల నామినేషన్ పత్రాలలో పూర్తి సమాచారం కొరవడటంతో తిరస్కరించినట్లు చెప్పారు. ప్రస్తుతం ఎన్నికల బరిలో నిలిచిన 15 మంది అభ్యర్థుల నుంచి 27 సెట్ల నామినేషన్‌లు ఉన్నాయన్నారు. 29వ తేదీ వరకు నామినేషన్‌ల ఉపసంహరణకు గడువు ఉన్నట్లు తెలిపారు.

ఒక్కటైన దివ్యాంగ జంటలు

నెహ్రూ నగర్: దివ్యాంగుల వివాహ ఇన్ఫో సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం రెండు దివ్యాంగ జంటలకు వివాహాలు జరిపించారు. శారదా కాలనీలోని ఓ కల్యాణ మండపంలో కదిరి వెంకట రమణ(గిద్దలూరు), ఎన్.దీపిక(కేసరిపల్లి) జంటకు, షేక్ మహబూబ్ బాషా(గుంటూరు), ఉప్పెర్ల రాజకుమారి(వెస్ట్ గోదావరి) జంటకు బంధుమిత్రుల మధ్య ఘనంగా వివాహం జరిపించారు. ఈ సందర్భంగా సొసైటీ శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర సిల్వర్ ప్యాలెస్ నిర్వాహకులు సాంబశివరావు, హైకోర్టు అడ్వకేట్ మాధవీలత, వ్యాపారవేత్త మహాలక్ష్మయ్య, తేజలు దివ్యాంగ జంటలను ఆశీర్వదించి కానుకలు అందజేశారు. గత కొద్ది సంవత్సరాలుగా దివ్యాంగ జంటలకు ఎటువంటి లాభాపేక్ష లేకుండా వివాహాలు జరిపిస్తున్నామని సొసైటీ చైర్మన్ నాగశ్రీ తెలిపారు. వివాహం చేసుకోవాలనుకునే దివ్యాంగ జంటలు ఎవరైనా 8555810100 నంబర్‌ను సంప్రదించవచ్చన్నారు. కార్యక్రమంలో సొసైటీ జనరల్ సెక్రెటరీ సురేష్, మాధురి, లక్ష్మీ, సృజన్, భాస్కర్, రాము, సునీల్, మురళి పాల్గొన్నారు.



కల్యాణ మహోత్సవంతో ఒక్కటైన దివ్యాంగ జంటలు

మే ఒకటి వరకు పోస్టల్ బ్యాలెట్‌కు అవకాశం

నెహ్రూ నగర్: గుంటూరు జిల్లాలో ఎన్నికల విధులు కేటాయించబడిన శాశ్వత, కాంట్రాక్ట్ ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ వివరాలతో దరఖాస్తు చేసుకునేందుకు మే ఒకటి వరకు ఎన్నికల కమిషన్ గడువు పొడిగించిందని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కీర్తి చేకూరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో అదర్ పోలింగ్ ఆఫీసర్స్(ఓపిఓ)గా ఎన్నికల విధులు కేటాయించబడిన ప్రభుత్వ అధికారులు, సిబ్బంది, అంగన్‌వాడీలు, కాంట్రాక్ట్ ఉద్యోగులు తమ పోస్టల్ బ్యాలెట్‌ను మే ఒకటి వరకు వినియోగించుకునేలా గడువు పొడిగిస్తూ ఎన్నికల కమిషన్ ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ కోసం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ హెల్ప్ డెస్క్ లో ఫారం–12(2 కాపీలు) అందించాలన్నారు. ఫారం–12తో పాటు ఓటర్ ఎపిక్ కార్డ్ కాపీ, డ్యూటీ ఆర్డర్ కాపి, 2 పాస్ పోర్ట్ సైజ్ ఫొటోలు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. హెల్ప్ డెస్క్ సిబ్బంది కార్యాలయ పని వేళల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విధుల్లో ఉంటారని తెలిపారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

పెదకాకాని: విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి చెందిన ఘటన పెదకాకానిలో చోటు చేసుకుంది. పెదకాకాని పాతూరు ఏరియాకు చెందిన షేక్ ముస్తాఫా వంట పనికి, గ్రామంలోని టుబాకో కంపెనీలో కూలీగా వెళ్తూ.. జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం తెల్లవారుజామున మోటార్‌తో నీళ్లు పట్టాడు. అనంతరం స్విచ్ ఆఫ్ చేసే సమయంలో కరెంట్ షాక్ తగిలి అక్కడే పడిపోయాడు. కుటుంబ సభ్యులు స్థానికంగా ప్రాథమిక చికిత్స అందించి, గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే షేక్ ముస్తాఫా(32) మరణించాడు. మృతునికి భార్య మెహరున్నీసా, కుమారుడు, కుమార్తె ఉన్నారు. పోస్టుమార్టం అనంతరం మృత దేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కె.వీరాస్వామి తెలిపారు. మృతదేహాన్ని పొన్నూరు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణ సందర్శించి, నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

మహారాజశ్రీ అద్దంకి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
IA No.273/2018, IA No.274/2018, IA No. 276/2018
O.S. No. 256/2016

Between :
రామావత్ బాలు నాయక్ ... పిటీషనరు/వాది
మరియు
మన్నెం లోకనాథం మరియు ఆరుగురు ... రెస్పాండెంట్లు/ప్రతివాదులు 1 to 4 మరియు ప్రపోజ్‌డ్ ప్రతి వాదులు 5 to 7
నోటీసు : మన్నెం గోపి, S/o. లేటు హనుమంతరావు, నరసాయపాలెం గ్రామం, పోస్ట్, బాపట్ల మండలం, బాపట్ల జిల్లా. బాపట్ల (D.M.C)
(6వ రెస్పాండెంటు/ప్రపోజ్‌డ్ 6వ ప్రతివాది)

పై నెంబరు దావాను వాది దావా పరిహారంబు పొందు నిమిత్తం దాఖలు చేసియున్నాడు. సదరు దావాలో 3వ ప్రతివాదిగా చూపబడిన మన్నెం హనుమంతరావు దావా పెండింగులో యుండగ చనిపోయి నందున ఆయనకి 2వ కుమారుడు / వారసుడు అయిన మిమ్ములను IA No.273/2018 Order 22 Rule 4 CPC ప్రకారం చనిపోయిన 3వ ప్రతివాదికి వారసునిగా చర్చమని దాఖలు కాబడిన యీనెంబరు పిటీషనులో 6వ రెస్పాండెంటుగా చూపబడిన మీరు, అటులనే IA 274/2018 నంబరున Or 22 R9 C.P.C ప్రకారం వారసులను 3వ ప్రతివాదికి యీదావాలో చేర్చుటకు జరిగిన కాలయాపనకు సంబంధించిన ఎబేట్‌మెంట్ ఆర్డరును సెట్ - ఎసైడ్ చేయమని కోరుచూ వాది దాఖలు చేసిన పిటీషనులో 6వ రెస్పాండెంటుగా చూపబడిన మీరు, మరియు IA No.276/2018 నంబరున Sec 5 లిమిటేషన్ యాక్ట్ ప్రకారం ఎబేట్‌మెంట్ ఆర్డరు సెట్ - ఎసైడ్ చేయమని కోరుచూ దాఖలు చేయవలసిన పిటీషనులో జరిగిన ఆలస్యమును మన్నించమని కోరుచూ వాది దాఖలు చేసిన యీ నెంబరు పిటీషనులోను 6వ రెస్పాండెంటుగా చూపబడిన మీకు ఇందు గూర్చి మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు నోటీసులు పంపినప్పటికీ తీసుకొనక కాలాయాపన చేయుచున్నందున ఈ పత్రిక ప్రకటన ద్వారా నోటీసులు జారీ చేయవలసినదిగా శ్రీ కోర్టువారు ఉత్తర్వులు యిచ్చియున్నారు.

ఇందు నిమిత్తమై మీకు ఏమైనా అభ్యంతరములు ఉన్న యెడల తేది. 17-5-2024న ఉదయం 10.30 ని.లకు పై కోర్టు వారి యెదుట స్వయముగా గానీ, వకీలు ద్వారా గాని హాజరై మీ అక్షేపణలు తెలుపవలెను. లేని యెడల మీ పరోక్షము నందు విచారించి తీర్మానించబడునని ఇందు మూలకముగా తెలియజేయుటమైనది.

"కోర్టు వారి ఉత్తర్వుల మేరకు"

అద్దంకి
తేది: 26-4-2024

పంచాగ్నుల రమేష్
అడ్వకేట్/అద్దంకి, బాపట్ల జిల్లా.
సెల్: 99487 88290

కానిస్టేబుల్ కుటుంబానికి ఎస్‌బీఐ రూ.1.11 కోట్ల చెక్కు అందజేత

నగరంపాలెం: పోలీస్ ఉద్యోగులు అందరూ జీతాలకు సంబంధించి ఎస్‌బీఐ బ్యాంక్ అందించే సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌బీఐ డీజీఎం ఎం.శరత్‌రాజ్ అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయం(డీపీఓ)లో విధులు నిర్వర్తించే పోలీస్ కానిస్టేబుల్(పీసీ) సీహెచ్ శ్రీనివాసరావు(52) ఈ ఏడాది జనవరి 16న గుండెపోటుతో మృతి చెందాడు. ఆయన రాష్ట్ర పోలీస్ శాఖ ఉద్యోగి కావడంతో అతను జీతానికి సంబంధించి బ్యాంక్ ఖాతా బ్రాడీపేట 2/14 ఎస్‌బీఐ ట్రెజరరీ శాఖలో ఉంది. ఈ క్రమంలో ఎస్‌బీఐ అందించే పోలీస్ శాలరీ ప్యాకేజీ బీమా క్లెయిమ్ కింద రూ.5 లక్షలు, ఒక కోటి రూపాయల ప్రత్యేక బీమా, హోం లోన్ సురక్ష కింద రూ.6.11 లక్షల చెక్కులను శుక్రవారం బ్రాడీపేట శాఖలో శ్రీనివాసరావు భార్య పద్మజ, కుమారుడు సాయితేజకు గుంటూరు డీజీఎం ఎం.శరత్‌రాజ్, రీజినల్ మేనేజర్ ఫణికొండలరావు అందించారు. కార్యక్రమంలో ట్రెజరరీ శాఖ చీఫ్ మేనేజర్ ఎం.అమరేంద్ర, డీఎం షేక్ బషీర్‌అహ్మద్, లైఫ్ మేనేజర్ వై.యుగంధర్ పాల్గొన్నారు.



చెక్కు అందిస్తున్న డీజీఎం శరత్‌రాజ్ తదితరులు

96 క్వార్టర్ మద్యం బాటిళ్లు స్వాధీనం



తాడికొండ: తాడికొండ అడ్డరోడ్డులో అక్రమంగా తరలిస్తున్న 96 క్వార్టర్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు తాడికొండ సీఐ సీహెచ్ ప్రభాకర్ తెలిపారు. వివరాల మేరకు.. పొన్నెకల్లు గ్రామానికి చెందిన సూర్రెడ్డి రామకృష్ణారెడ్డి 96 క్వార్టర్ మద్యం బాటిళ్లతో వెళ్తుండగా.. తాడికొండ అడ్డరోడ్డులో పట్టుకొని ఠాణాకు తరలించినట్లు తెలిపారు. ఎవరైనా అక్రమంగా మద్యం, నగదు పంపిణీ చేస్తున్నట్లు తెలిస్తే తన ఫోన్ నంబరు 86888 31374 నంబరుకు నేరుగా సమాచారం అందించాలన్నారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
బాపట్ల డివిజన్
95055 07638 (బాపట్ల)
90102 23706 (వేమూరు, రేపల్లె)
Office mail : sakshigntadvt@gmail.com